# నమస్తే తెలంగాణ

## భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, మంగళవారం 6 ఆగస్టు 2024 | BHADRADRI KOTHAGUDEM


## సీతారామ నీళ్ల కోసం రేపు ధర్నా

**బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు**



బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

సారపాక, ఆగస్టు 5 : సీతారామ ప్రాజెక్టు నీటిని పినపాక నియోజక వర్గానికి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మణుగూరు పట్టణంలో ఈ నెల 7న ఉదయం 10 గంటలకు ధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు భద్రాద్రి జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే సీతారామ నీటిని లింక్ కెనాల్ ద్వారా ఖమ్మం జిల్లా పాలేరు, ఖమ్మం, మధిర నియోజకవర్గాలకు తరలించే యోచనలో మంత్రులు ఉన్నారని, ఇది జరిగితే భద్రాద్రి జిల్లా రైతులు తీవ్ర అన్యాయానికి గురికాక తప్పదని పేర్కొన్నారు. దీనిపై ముందుగా మణుగూరు కేంద్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులు, రైతులతో కలిసి ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. తర్వాత భద్రాద్రి జిల్లావ్యాప్తంగా రైతుల మద్దతుతో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. బుధవారం నిర్వహించే ధర్నా కార్యక్రమానికి రైతులు, బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

## చేసిన సేవలతోనే గుర్తింపు

**ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు**



ఎంపీడీవో కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేస్తున్న జడ్పీ చైర్మన్ కమల్‌రాజు

పెనుబల్లి, ఆగస్టు 5 : రాజకీయాల్లో పదవులు ఉన్నా.. లేకున్నా ప్రజల కోసం మనం చేసిన పనులు, సేవా కార్యక్రమాలే చిరస్థాయిగా నిలుస్తాయని, గుర్తింపును తీసుకొస్తాయని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ నాయకుల విగ్రహాలను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఎంపీడీవో కార్యాలయంలో ముఖద్వారాన్ని ప్రారంభించి అంబేద్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను ప్రారంభించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. మంగళవారం పదవీ విరమణ చేయనున్న ఎంపీపీ బీరెల్లి రఘు, జడ్పీటీసీ కట్టా అజయ్‌బాబు, ఎంపీటీసీలు కలిసి జాతీయ నాయకుల విగ్రహాలను ఇక్కడ ఏర్పాటు చేయడం వారి పనితనానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి


**గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీవో రాహుల్**



వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో

బూర్గంపహాడ్, ఆగస్టు 5 : గిరిజనులు తమ సమస్యలపై సమర్పించిన అర్జీలను పరిశీలించి ప్రాధాన్యతా క్రమంలో త్వరితగతిన పరిష్కరించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. భద్రాచలం ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ పరిధిలోని సమస్యలను తక్షణమే పరిష్కరించడంతోపాటు మిగిలిన వాటిని అధికారులకు అందించి ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలని సూచించారు. గిరిజన దర్బార్‌లో ఎక్కువగా పోడు భూములు, వ్యక్తిగత, భూ సమస్యలు, స్వయం ఉపాధి పథకాలు, ట్రైకార్ రుణాలు, గురుకుల కళాశాల, పాఠశాలల్లో సీట్ల కోసం, ఉన్నత చదువులకు ఆర్థిక సాయం తదితరాలపై దరఖాస్తులు వచ్చినట్లు పీవో తెలిపారు. వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసి.. అర్హులైన గిరిజనులకు విడతలవారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఆర్‌సీవో నాగార్జునరావు, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఎస్‌వో, ఏపీవో, మునీర్‌పాషా, డీటీఆర్‌వోఎఫ్‌ఆర్ శ్రీనివాస్, ఉద్యానశాఖ అధికారి ఉదయ్, అగ్రికల్చర్ ఏడీ భాస్కర్, కొండరెడ్ల అధికారి నరేశ్ పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికలకు కసరత్తు?



- సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తం
- ఆగస్టు చివరి, లేదా సెప్టెంబర్ మొదటి వారంలో షెడ్యూల్‌కు అవకాశం
- 589 పంచాయతీల్లో మూడు దశల్లో పోలింగ్ నిర్వహణకు ప్రణాళికలు
- పాత రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లేందుకు ప్రభుత్వం నిర్ణయం

మామిళ్లగూడెం, ఆగస్టు 5 : పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటన చేయడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. అందుకు సంబంధించిన కసరత్తును కూడా చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. 'పంచాయతీరాజ్ చట్టం-2018' ప్రకారం రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం 2024, జనవరి 31న ముగిసింది. 2024 ఫిబ్రవరి నుంచి నూతన గ్రామ పంచాయతీలు, వార్డులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే, శాసనసభ ఎన్నికలు, నూతన ప్రభుత్వ ఏర్పాటు వంటి కారణాల వల్ల పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. పల్లెల్లో ప్రత్యేక అధికారులను నియమించి పాలన కొనసాగిస్తోంది. అయితే ఇటీవల రాష్ట్ర ఉన్నతాధికారుల సమీక్షలో పంచాయతీ ఎన్నికలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. పంచాయతీ ఎన్నికలను ఆగస్టు నెలలో నిర్వహించాలని, కసరత్తు ప్రారంభించాలని కలెక్టర్లను ఆదేశించారు. దీంతో ఖమ్మం జిల్లాలో ఉన్న 20 పంచాయతీరాజ్ మండలాల్లో 589 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది.

### మూడు దశల్లో నిర్వహణకు ఏర్పాట్లు

పంచాయతీలు, వార్డుల రిజర్వేషన్లు ఖరారు కావడంతో జిల్లాలో ఉన్న 589 గ్రామ పంచాయతీల్లో మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. తొలిదశ ఎన్నికలు ఆగస్టు చివరి వారం లేదా సెప్టెంబర్ మొదటి వారంలో ప్రారంభమైతే.. అదే నెల చివరి వరకు ఎన్నికల ప్రక్రియను ముగిస్తారు. దీంతో నూతన పాలక వర్గాలు కొలువు తీరనున్నాయి. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ చేపడతారు. అప్పుడే ఉప సర్పంచ్‌నూ ఎన్నుకుంటారు.

### విలీన పంచాయతీల ఎన్నికలపై సందిగ్ధం

గతంలో ఖమ్మం రూరల్ మండలంలో పట్టణీకరణ చెందిన గ్రామాలను నాటి పరిస్థితుల రీత్యా ఖమ్మం నగర పాలక సంస్థలో విలీనం చేశారు. వాటిలో పోలేపల్లిలో కొంతభాగంతోపాటు ఏదులాపురం, పెద్దతండా, గుర్రాలపాడు, చిన్న వెంకటగిరి, గుదిమళ్ల గ్రామాలను పూర్తిగా నగరంలో విలీనం చేశారు. అయితే 2018 పంచాయతీ ఎన్నికల్లో ఆయా గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించలేదు. అయితే మారిన రాజకీయ పరిణామాల క్రమంలో ఆయా పంచాయతీలను తిరిగి గ్రామ పంచాయతీలుగా మారుస్తూ ప్రభుత్వం మరోసారి నిర్ణయం తీసుకుంది. అప్పటి నుంచి వాటికి పంచాయతీ ఎన్నికలుగానీ, మున్సిపల్ ఎన్నికలుగానీ జరగలేదు. దీంతో అవి అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుత పంచాయతీల ఎన్నికల కసరత్తు నేపథ్యంలో ఈ విలీన గ్రామాల ఎన్నికలపై సందిగ్ధం నెలకొంది. 'వీటిల్లో పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తారా? లేదా మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తారా?, అసలు వీటి రిజర్వేషన్లు ఏమిటి?' అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**కసరత్తు ప్రారంభించాం..**

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లాలో గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభించాం. గత రిజర్వేషన్లను కొనసాగిస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం వాటిలో ఎలాంటి మార్పులు చేర్పులు లేవు. ఓటర్ల జాబితా రూప కల్పనతోపాటు అధికార యంత్రాంగానికి శిక్షణ ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రభుత్వ అధికారిక ఉత్తర్వులు వచ్చిన వెంటనే ఎన్నికల పనులు ముమ్మరం చేస్తాం.

**-హరికిషన్, డీపీవో, ఖమ్మం**

## నీటి కుంటలతోనే భూగర్భ జలాలు వృద్ధి

**భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్**



మొక్కలు నాటుతున్న కలెక్టర్, డీఆర్‌డీవో

టేకులపల్లి, ఆగస్టు 5 : ప్రతి రైతు తమ వ్యవసాయ భూముల్లో నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలని, అప్పుడే భూగర్భ జలాలు మరింతగా వృద్ధి చెందుతాయని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో రవీందర్‌రావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం ప్రాధాన్యత గురించి వివరించారు. తర్వాత స్వయం సహాయక బృందాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శానిటరీ న్యాప్కిన్స్ తయారీ కేంద్రాన్ని పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. అనంతరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన 'చేయి చేయి కలుపుదాం-గంజాయిని నిర్మూలిద్దాం' అనే పోస్టర్లను ఆవిష్కరించారు. పాతతండాకు చెందిన ధారవత్ హర్జ సాగు చేసిన మునగ తోటను సందర్శించిన కలెక్టర్.. మునగలో అంతర పంటగా పత్తి సాగు చేయడం బాగుందన్నారు. రైతులు మునగ సాగుపై దృష్టి సారిస్తే లాభాలు పొందవచ్చన్నారు. వర్షాకాలంలో వరద బయటకు వెళ్లకుండా నీటి కుంటలు ఏర్పాటు చేసుకుంటే అందులోనే నీరు నిల్వ ఉంటుందని, దీనికి ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు సాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో విద్యచందన, తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీవో రవీందర్‌రావు, ఎంపీవో లక్ష్మిగణేశ్ గాంధీ, ఏపీవో శ్రీనివాస్, ఏపీఎం రవికుమార్, ఎంపీపీ బానోత్ మౌనిక, వైస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్, ఎంపీటీసీ బానోత్ సరోజిని, ఏవో అన్నపూర్ణ, ఎస్సై సురేశ్, ఆర్ఐ రత్తయ్య, ఈసీ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ ప్రభుత్వానికి మూల్యం తప్పదు

- విద్యారంగ సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే గుణపాఠం తథ్యం
- పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఖమ్మంలో విద్యార్థుల భారీ ర్యాలీ




పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఖమ్మంలో భారీ ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఆగస్టు 5:విద్యారంగ సమస్యలను పట్టించుకోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి తగిన మూల్యం తప్పదని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ హెచ్చరించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే గుణపాఠం తథ్యమని స్పష్టం చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా కేంద్రంలోని కాల్వొడ్డు నుంచి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ వరకూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వందలాది విద్యార్థులతో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన జిల్లా జనరల్ యూనివర్సిటీ హామీని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉండి కూడా ఈ యూనివర్సిటీ ఏర్పాటుపై కనీస ప్రస్తావన తీసుకురాకపోవడం దుర్మార్గమని అన్నారు. ఎన్నికల సందర్భంగా హామీలు ఇచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక బడ్జెట్‌లో ఆ హామీల స్థాయిలో నిధులు కేటాయించకపోవడం మోసం చేయడమేనని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను, వసతిగృహ విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించకుంటే విద్యార్థి ఉద్యమాలతో ప్రభుత్వ మెడలు వంచుతామని హెచ్చరించారు. అనంతరం అదనపు కలెక్టర్ మధుసూదన్‌కు వినతిపత్రం అందించారు. సంఘం నాయకులు లక్ష్మణ్, సతీశ్, శేషి, వినయ్, కార్తీక్, ప్రసాద్, వంశీ, గోపి, యశ్వంతి, నరేందర్, మమత తదితరులు పాల్గొన్నారు.

## 'మహాలక్ష్మి'తో ఆటోడ్రైవర్లకు తీరని నష్టం

- ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
- ఖమ్మం ఆర్‌టీఏ ఆఫీసు ఎదుట ఆటోడ్రైవర్ల ధర్నా



ఎంవీఐకి వినతిపత్రం అందిస్తున్న ఆటో కార్మికులు

రఘునాథపాలెం, ఆగస్టు 5: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని తీసుకొచ్చి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడంతో ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోయారని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వై.విక్రమ్ ఆరోపించారు. ఆటో వృత్తిని నమ్ముకున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే, ఆటో డ్రైవర్లకు, ఇతర రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లతో కలిసి ఖమ్మం జిల్లా ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 106(1)ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంవీఐ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. సంఘం బాధ్యులు జిల్లా ఉపేందర్, రాందాస్, సాగర్, నాగేశ్వరరావు, రమేశ్, నర్సయ్య, లక్ష్మణ్, బాలాజీ, రవి, సైదులు, సతీశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మధిరను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తా

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- రూ.45 కోట్లతో యండపల్లి ఇండస్ట్రియల్ పార్కుకు శంకుస్థాపన



ఇండస్ట్రియల్ పార్కుకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

మధిర రూరల్, ఆగస్టు 5 : నియోజకవర్గ కేంద్రమైన మధిరను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి తెలంగాణలో నెంబర్‌వన్ స్థానంలో నిలుపుతానని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. సోమవారం మధిర నియోజకవర్గంలో పర్యటించిన ఆయన యండపల్లిలో 84 ఎకరాల్లో రూ.45 కోట్లతో నిర్మించనున్న ఇండస్ట్రియల్ పార్కు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ మధిర పట్టణ విస్తరణకు కావాల్సిన బైపాస్ రోడ్లు నిర్మిస్తామన్నారు. మధిర ప్రజల దశాబ్దాల కల అయిన ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు రూ.45 కోట్లు మంజూరు చేశామన్నారు. టెండర్లు పిలిచి వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల పరిధిలోని దేశినేనిపాలెం, మడుపల్లి, రాయపట్నం, అల్లీనగరం గ్రామాల్లో సుమారు రూ.14.90 కోట్లతో నిర్మించనున్న రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, ఇండస్ట్రియల్ పార్కు చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఈఈడీ కళ్యాణ్ చక్రవర్తి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పాఠశాల ఎదుట విద్యార్థుల నిరసన

**టీచర్లను కేటాయించాలని తల్లిదండ్రులతో కలిసి డిమాండ్**



పాఠశాలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

అశ్వాపురం, ఆగస్టు 5 : తమ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం కుర్వపల్లి కొత్తూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాఠశాలకు తాళం వేసి తల్లిదండ్రులతో కలిసి సోమవారం ఆందోళన చేపట్టారు. పాఠశాలలో గతంలో పనిచేసిన ముగ్గురు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా.. ఐదు తరగతులకు ఒక్కరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో విద్యార్థుల చదువులు ముందుకు సాగడం లేదని తెలిసిన తల్లిదండ్రులు ఆగ్రహంతో పాఠశాలకు తాళం వేసి పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలోని పాఠశాలపై చిన్నచూపు చూడకుండా వెంటనే ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేశారు.

## గొరిల్లా.. కోతులు పారిపోయేలా..!



సారపాకలో కోతులను తరిమేందుకు గొరిల్లా వేషధారణలో పంచాయతీ సిబ్బంది

సారపాక, ఆగస్టు 5 : ఇల్లుపీకి పందిరేస్తున్న కోతులను తరిమేందుకు పారిశ్రామిక ప్రాంతమైన సారపాక పంచాయతీ ఈవో మహేశ్.. వినూత్న ఆలోచనకు రూపకల్పన చేసి ఆచరణలో పెట్టాడు. రోజురోజుకూ పెరిగిపోతున్న కోతుల బెడదను నివారించాలని ప్రజలు పలుమార్లు ఆయనకు విన్నవించారు. దీంతో పంచాయతీ సిబ్బందికి గొరిల్లా వేషధారణ వేసి పురవీధులతోపాటు అన్ని కాలనీల్లో తిప్పే కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుట్టారు. గొరిల్లా రూపంలో సంచరిస్తున్న వ్యక్తిని ప్రజలు ఆశ్చర్యంగా చూస్తుంటే.. కోతులు మాత్రం భయంతో పరుగులు పెడుతున్నాయి.

# పాత ప్లాంట్ కూలింగ్ టవర్ల కూల్చివేత

**ముగిసిన కేటీపీఎస్ ఓఅండ్‌ఎం ప్రస్థానం**



పాత ప్లాంట్‌లో కూలుతున్న కూలింగ్ టవర్లు

పాల్వంచ, ఆగస్టు 5: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ వెలుగులు విరజిమ్మిన కేటీపీఎస్ పాత ప్లాంట్ ఓఅండ్‌ఎంలో ఎనిమిది యూనిట్లకు చెందిన 8 కూలింగ్ టవర్ల కూల్చివేత సోమవారం విజయవంతమైంది. భద్రాద్రి జిల్లా పాల్వంచలో ఉన్న కేటీపీఎస్ పాత కర్మాగారాన్ని తొలగించేందుకు రూ.450 కోట్లతో ముంబైకి చెందిన హెచ్‌ఆర్ కంపెనీ టెండర్ దక్కించుకుంది. 'ఏ' స్టేషన్‌లో 102 మీటర్ల ఎత్తున్న నాలుగు కూలింగ్ టవర్లను ఉదయం 8:08 గంటలకు ఎక్స్‌ప్లోజివ్స్‌తో కూల్చివేశారు. 'బీ' స్టేషన్‌లో 115 మీటర్ల ఎత్తున్న రెండు కూలింగ్ టవర్లను 10:10 గంటలకు 'సీ' స్టేషన్‌లోనూ అంతే ఎత్తున ఉన్న మరో రెండు కూలింగ్ టవర్లను 11.40 గంటలకు నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సంబంధిత కంపెనీ ప్రతినిధులు, జెన్కో అధికారులు పర్యవేక్షించారు. అయితే ఎన్నో ఏళ్లనాటి ఈ కూలింగ్ టవర్ల కూల్చివేతను పాల్వంచ పట్టణ వాసులు దూరం నుంచి ఆసక్తిగా వీక్షించారు. ఆ పరిసరాలకు ఎవరినీ వెళ్లనీయకుండా పోలీసులు, ఎస్‌పీఎఫ్ సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో నిషేధం విధించారు. టవర్ల కూల్చివేత ప్రక్రియ క్షణాల్లో విజయవంతం కావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. టవర్ల కూల్చివేత సమయంలో కేటీపీఎస్ 5వ దశ నుంచి రాష్ట్ర గ్రిడ్‌కు వెళ్లే లైన్లలో విద్యుత్ సరఫరాను నిలిపివేసి వేరే మార్గం ద్వారా సరఫరా చేశారు.

**ముగిసిన ఓఅండ్‌ఎం ప్రస్థానం..**

కేటీపీఎస్ పాత కర్మాగారంలోని 'ఏ' స్టేషన్ నిర్మాణానికి 1965-67లో పునాదులు పడ్డాయి. మొదటగా 60 మెగావాట్ల సామర్థ్యంతో నాలుగు యూనిట్లను పూర్తి చేశారు. అనంతరం 1970 తర్వాత 'బీ' స్టేషన్‌లో 120 మెగావాట్లతో రెండు యూనిట్లను, 'సీ' స్టేషన్‌లో 120 మెగావాట్ల చొప్పున మరో రెండు యూనిట్లను నిర్మించారు. 720 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని రాష్ట్ర గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. 2,500 మంది కార్మికులు ఆహ్లాదకరమైన వాతావరణంలో పాత ప్లాంట్‌లో విధులు నిర్వహించేవారు. 1965లో పాల్వంచ జనాభా 15 వేలకు మించి లేరు. అయితే ఈ కర్మాగారం నిర్మాణంతో ఉద్యోగుల సంఖ్య పెరిగింది. దాంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి అనేకమంది వలస వచ్చారు. దీంతో దాదాపు 1.20 లక్షల జనాభాతో ప్రస్తుతం పట్టణం మున్సిపాలిటీగా అవతరించింది.

**2020లోనే ఉత్పత్తి నిలిపివేత..**

కేటీపీఎస్ పాత కర్మాగారంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం చాలా తక్కువ. యూనిట్లు సక్రమంగా నడుస్తున్నప్పటికీ దీని నుంచి వెలువడే బూడిద ప్రజలకు హానికరంగా మారింది. ఈ క్రమంలో ఢిల్లీకి చెందిన పొల్యూషన్ కంట్రోల్ అధికారులు ఈ యూనిట్లను తొలగించాలని ఆదేశించారు. స్థానికులు కూడా పలుమార్లు ఫిర్యాదులు చేయడంతో పాత ప్లాంట్ తొలగింపునకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన అప్పటి టీఆర్‌ఎస్ ప్రభుత్వం కేటీపీఎస్‌లో ఏడో దశ నిర్మాణం కోసం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రత్యేక నిబంధనలు విధించింది. ఈ ఎనిమిది యూనిట్లను తొలగిస్తేనే కొత్త కర్మాగారానికి అనుమతిస్తామని చెప్పడంతో 2020 ఏప్రిల్‌లో పాత ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. టెండర్లు నిర్వహించి హెచ్‌ఆర్ సంస్థకు కూల్చివేత పనులను అప్పగించారు. తాజాగా కూలింగ్ టవర్ల కూల్చివేతతో సోమవారం నుంచి కేటీపీఎస్ ఓఅండ్‌ఎం కర్మాగారం ప్రస్థానం ముగిసినట్లయింది.

## అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టండి

**అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్**

మామిళ్లగూడెం, ఆగస్టు 5 : గ్రీవెన్స్‌లో సమర్పించిన అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించిన ఆయన వాటిని ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. కాగా.. ఖమ్మం నగరానికి చెందిన బి.రమణ, కొణిజర్ల మండలం సింగరాయపాలెం గ్రామానికి చెందిన వుప్పెల వెంకటరెడ్డి, ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లికి చెందిన నూకల ఉమాదేవి, కొణిజర్ల మండలం పల్లిపాడుకు చెందిన డి.ఉపేందర్‌రావు తదితరులు తమ సమస్యలపై గ్రీవెన్స్‌లో వినతులు సమర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


తల్లి పాల వారోత్సవాలు

- బిడ్డల ఎదుగుదలపై తల్లిపాల ప్రభావం ఉంటుంది...
- అమ్మపాల ఆవశ్యకతను నేటితరం మహిళలు గుర్తించాలి...
- బిడ్డకు 6 నెలల నుండి 2 సం.ల వరకు అనుబంధ ఆహారంతో పాటు తల్లిపాలు ఇవ్వాలి...
- ముర్రుపాలు బిడ్డకు శ్రేష్ఠం.. తల్లిపాలు - అమృతం కన్నా మిన్న...

శ్రీ రక్ష హాస్పటల్

డాక్టర్స్ స్ట్రీట్, ఎస్.బి.ఐ రోడ్, న్యూ పాల్వంచ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

డా॥ స్వాతి.కె MBBS., DGO(OSM), ప్రసూతి మరియు స్త్రీ వైద్య సంతాన సాఫల్యత నిపుణురాలు

డా॥ పి. రామ్‌ప్రసాద్ MBBS., M.D., అనస్థీషియా & క్రిటికల్ కేర్

డబ్బా పాలు వద్దు-తల్లిపాలు ముద్దు

- బిడ్డకు తల్లిపాల విషయంలో అపోహలు తొలగించండి
- పుట్టిన బిడ్డకు 6 నెలలు తల్లి పాలు ఇవ్వడం బిడ్డకు శ్రేష్ఠం...
- తల్లిపాలు పిల్లల రోగనిరోధక శక్తిని పెంచుతాయి...
- బిడ్డల ఎదుగుదలపై తల్లిపాల ప్రభావం ఉంటుంది...
- అమ్మపాల ఆవశ్యకతను నేటితరం మహిళలు గుర్తించాలి...
- బిడ్డకు 6 నెలల నుండి 2 సం.ల వరకు అనుబంధ ఆహారంతో పాటు తల్లిపాలు ఇవ్వాలి...
- ముర్రుపాలు బిడ్డకు శ్రేష్ఠం.. తల్లిపాలు - అమృతం కన్నా మిన్న

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలు

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616